# భగవంతుడిమీద మనకున్నభక్తి అందరికీతెలియాలి అనుకుంటే అహంకారం పెరుగుతుంది

(సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు, 30-08-2001, కోలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వర్తమానకాలాన్ని విడిచిపెట్టవద్దు, చేతిలోఉన్న పనిని విడిచిపెట్టవద్దు. ఆధ్యాత్మికంగాకాని, భౌతికంగాకాని అభివృద్ధిలోనికిరావాలంటే చేతిలోఉన్నపనిని శ్రద్ధగా, ప్రేమగాచేయండి. అదే అభివృద్ధికిబాట, దానివలన ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుంది. చాలామంది జరిగిపోయిన గొడవలుఅన్నీ తలపెట్టుకొని దుఃఖపడుతూఉంటారు. అది అభివృద్ధిలోనికి వచ్చేవారి లక్షణంకాదు. రేపు జాగ్రత్తగురించి నీవు ఆలోచించనక్కరలేదు. ఈరోజు తీసుకోవలసిన జాగ్రత్త నీవు తీసుకొంటే ఈజాగ్రత్తే రేపటిరోజు జాగ్రత్తను తీసుకొంటుంది. అంతేగాని ఈరోజు పనిగురించి వదిలేసి రేపటిగురించి ఆలోచిస్తే దానివలన ఏమీప్రయోజనంలేదు. కొంతమంది జరిగిపోయిన సంఘటనలు తలపెట్టుకొంటూ, భవిష్యత్గురించి ఊహించుకొంటూ వర్తమానకాలం పాడుచేసుకొంటారు. మారోజులు ఎలావెళతాయి, మమ్మల్ని ఎవరుచూస్తారు అనిఅంటూఉంటారు. అందరికి ప్రభువు ఈశ్వరుడే. అంతా ఆయనేచూసుకొంటాడు. సంపదలు లేకపోయిన కొంతమందికి రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి. కొంతమందికి ఎంతసంపదఉన్నా భోజనానికి ఇబ్బందిపడుతూఉంటారు. మనకు తెలిసినా, తెలియకపోయినా భగవంతుని సంకల్పంలో జీవుడికి ఏరకంగా యాత్రనడవాలో అది నిర్ణయించబడి ఉంటుంది, దానిప్రకారం ఆ జీవుడియాత్ర జరుగుతూఉంటుంది. భవిష్యత్గురించి లేనిపోనివి ఊహించుకోవటంవలన భయం కలుగుతుంది. ఊహించుకోవటం మానివేస్తే భయంలేదు.

పూర్వం అనేకమంది తపస్సులుచేసి పవిత్రులుఅయ్యి, నాస్వరూపమును పొందారు సందేహంపెట్టుకోవద్దు. మీరుకూడా ప్రయత్నంచేసి నాస్వరూపమును పొందండి అని భగవంతుడు చెపుతున్నాడు. రాగం, భయం, క్రోధం ఇవి మూడు తగ్గించుకోమని భగవంతుడు చెపుతున్నాడు. ఎందుచేతనంటే ఇవిమూడు అహంవృత్తిని పెంచుతాయి. అహంవృత్తి మూలంలోనికి వెళ్ళటానికి ప్రయత్నంచెయ్యి, అహంవృత్తి మూలంలోనే పరమేశ్వరుడుఉన్నాడుఅని భగవాన్ చెప్పారు. రాగం, భయం, క్రోధంఉంటే నీవు అహంవృత్తిమూలంలోనికి ఎలావెళ్ళగలవు, ఇవి అహంవృత్తి మూలంలోనికి వెళ్ళనివ్వవు నిన్ను

గొలుసులు వేసుకొని బయటకు లాగుకొనివస్తాయి. ఇవిఉంటే అహంవృత్తి మూలంలోనికి వెళ్లాలన్నా నీవువెళ్లలేవు. అది మాటలుచెప్పినంత తేలికకాదు. అనేక బాహ్యకారణాలవలన నీకు శాంతిరావచ్చు, అది నిజమైనశాంతికాదు. నీలోపల చైతన్యంఉంది. ఆ చైతన్యానుభవం పొందాలి అనేదానిమీదే నీగురిఉండాలి. అప్పుడు మాత్రమే అది నీకు తెలియబడుతుంది. అక్కడనుండి నీకు శాంతి, ఆనందం అందితే అది నీ కడసారిజన్మ. బాహ్యకారణాలవలన నీకు సుఖంవచ్చినా అది దుఃఖంగామారిపోతుంది. నీవు ఏపనిచేసినా ఆసక్తిపెట్టుకోవద్దు. ఆసక్తివలన మనస్సు బయటకు వచ్చేస్తుంది. నీచేతిలోఉన్నపనిని శ్రద్ధగా, ప్రేమగా, ప్రీతితో చెయ్యి. అది కర్మయోగం. లోకంతో ఎక్కువ అనుబంధం పెట్టుకోవద్దు. నీవు అన్నివిషయాలలో కలుగజేసుకోవద్దు. సమాజంతో అనుబంధంలేకుండా బ్రతకలేముకాబట్టి అనుబంధం ఎంతవరకుఉండాలో జాగ్రత్తగాచూసుకోవాలి. నీవు మోక్షంపొందాలంటే ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఎంతముఖ్యమో నీకు పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా వాటిని సహించటం నేర్చుకోవటంకూడా అంతేముఖ్యం. కొంతమంది చిన్నకష్టంవచ్చినా సహించలేరు. కష్టంవచ్చినా కెరటంలేని సముద్రంలాగ ఉండటం నేర్చుకోవాలి. నీవు ఏవస్తువునుఅయితేపొందాలో దానిమీదే నీగురిఉండాలి.

నీకు ఉద్రేకం ఎక్కువగావస్తూఉంటే రజోగుణానికి దగ్గరగాఉన్నట్లుగుర్తు. నిద్ర, తిండిఅంటే ఇష్టంగాఉంటే తమోగుణానికి దగ్గరగాఉన్నట్లుగుర్తు. సత్వగుణంలోఉంటే మనస్సు, శరీరం తేలికగాఉంటాయి, కష్టపడి మనపని మనంచేసుకోవాలి అనిపిస్తుంది, చేతనయితే ఇతరులకు సహాయంచేయాలని ఉంటుంది. మనం సత్వగుణాన్ని పెంచుకోవాలి. రజోగుణంతగ్గాలి, తమోగుణంతగ్గాలిఅంటే అవి తగ్గవు నీవు సత్వగుణాన్ని పెంచుకొంటే రజోగుణం, తమోగుణం ప్రభావంతగ్గుతుంది. మనపొట్టకు తిన్నది మనకూడారాదు. ఇతరులకు సహకరించిందే మరణానంతర జీవితంలో నీకూడా వస్తుంది. ఇది మనకు తెలియటంలేదు. నీవు ఏపనిచేస్తున్నా, నీదేహప్రారబ్దం ఎలాఉన్నా లోపలఉన్న చైతన్యాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటంమీదే నీగురిఉండాలి. అక్కడనుండి నీకు శాంతిఅందాలి. అది ఒక్కటే నిజమైన శాంతి. వ్యక్తిఅంటే శరీరం, మనస్సు, తెలివి. చనిపోయేవరకు మనిషి ఈమూడింటితో కలిసిఉంటాడు. కాని ఈ మూడునీవుకాదు. నీవుఆత్మవు నీవుకాని విషయాలను ఆత్మమీద ఆరోపిస్తున్నావు. ఈ ఆరోపణవదిలేస్తే ఇప్పడే, ఇక్కడే శాంతిసామ్రాజ్యానికి అధిపతివి అవుతావు. ఆత్మకు చావులేదు, పుట్టుకలేదు, ఆత్మలోగుణాలులేవు, దానికి ద్వితీయంలేదు. కాని

మనస్సులోఉన్న గుణాలను, శరీరంయొక్క చావు, పుట్టుకలను ఆత్మమీద ఆరోపించి, దుః ఖపడుతున్నావు. ఇలా ఎంతకాలంఅయితే ఆరోపిస్తున్నావో అంతకాలం ఈకర్మబంధంలోనుండి నిన్ను ఎవరూ విడుదలచేయలేరు. నీవు నీవుగాఉంటే ఏగొడవలేదు అంటారు భగవాన్. నీవు దేహంగాఉండకు, నీవుమనస్సుగాఉండకు, నీవునీవుగాఉండు. నీవునీవుగాఉంటే నీవు ఏదైతేకాదో దానిలోనుండి విడుదలపొందుతావు. మీగురించి మీరు ఎంతతక్కువగా ఆలోచిస్తే భగవంతుడు మీగురించి అంతఎక్కువగా ఆలోచిస్తాడు. హృదయంలో ఎక్కువగాఉండటం అలవాటుచేసుకో. హృదయం ఒకరకంగా చెపుతోందిఅనుకో, నీమనస్సు ఇంకోరకంగా చెపుతోందిఅనుకో. నీమనస్సు చెప్పినదానిని ఒకప్రక్కకుపెట్టి హృదయంచెప్పినట్లు చెయ్యి నీవు బాగుపడతావు. నీవుకానిది నీవు అనుకొంటున్నావు. నీవుకానిదానిలోనుండి బయటకురావటానికే జపం, ధ్యానం, విచారణ. నీవు నిజానికి దూరంగాఉన్నావు, లోకానికి దగ్గరగాఉన్నావు. ఎంతకాలంఅయితే లోకానికి దగ్గరగాఉన్నావో, ఎంతకాలంఅయితే నీకులోకంతో తాదాప్యంఉందో అంతకాలం నీవు అసత్యంలోఉండితీరవలసిందే. నీకు ఉపయోగపడేవనిచేసుకొని, అక్కరలేనివ్యాపకాలు తగ్గించుకో. నీశరీరం ఆరోగ్యంగాఉండాలంటే నీమనస్సు సహకరించాలి. మనస్సు ఆరోగ్యంగాఉండాలంటే జపం, ధ్యానం శ్రద్ధగాచేయాలి, సాధన శ్రద్ధగాచేయాలి.

భక్తిని రహస్యంగాఉంచుకోవాలి. భక్తిఅనేది నీకు భగవంతుడికి సంబంధించిన విషయం, ఇదిఅందరికీ తెలియాలిఅనుకొంటే అహంకారం పెరుగుతుంది. ఎన్ని యోగాభ్యాసాలుచేసినా ఈశ్వరునిపాదాలయందు భక్తిలేకపోతే, ఆయన అనుగ్రహంలేకుండా మనం పునర్జన్మ కారణములనుండి విడుదలపొందలేము. రాగద్వేషములను, ఉద్రేకాలను భక్తి తగ్గించుకొంటూవస్తుంది. ఉన్నదానితో సంతృప్తిపడకపోతే, ఏదోఆశిస్తూఉంటే ఒకోసారి ఉన్నదిపోతుంది. నిరంతరంఏదో ఆశించేవాడికి, వాడికి 100 కోట్లు ధనంఉన్నా ఆ ఉన్నదానిలో ఉన్నసంతృప్తివాడికి తెలియదు. ఏదివచ్చినా అది ఎప్పడూఉండదుఅనుకో. నీకు మంచివచ్చినా, చెడ్డవచ్చినా, గౌరవంవచ్చినా, అగౌరవంవచ్చినా, సుఖంవచ్చినా, దుఃఖంవచ్చినా ఇవిఅన్నీ కాలప్రవాహంలో కొట్టుకొనిపోతాయి. ఇవిఏమీ నిజంకాదు అందువలన ఏదివచ్చినా ఇది శాశ్వతంగా ఉండదుఅనుకో. ఇప్పడు మనకు తినటానికి అన్నంఉంది, సాధనచేసుకోవటానికి అనేక అనుకూల పరిస్థితులు ఉన్నాయికాని సాధనచేయలేకపోతున్నాము. ఇదే మాయ. వారు మనకు ఏమిఉపకారంచేసారు, వీరు మనకుఏమి ఉపకారంచేసారు అనిఅనుకొంటూ

ఉంటాము. అలా అనుకొనేబదులు వారికి మనం ఏమి ఉపకారం చేసామునని ప్రశ్న ఎందుకువేసుకోవుఅంటే నీబుద్ధిలో ఏదోదోషంఉందిఅని అర్థం.

ఉన్నదేదో ఒకసద్వస్తువు నీలోపలఉంది. దాని విషయంలో సందేహంవద్దు. ఎలాజీవిస్తే- ఆవస్తువు నీకు తెలియబడుతుందో తదనుగుణంగా జీవించండి. నీకు మోక్షంఇచ్చేది లోకంకాదు, మోక్షంఇచ్చేది ఈశ్వరుడు. ఎవడైతే మోక్షంఇస్తాడో వాడిఅనుగ్రహంపొందాలిగాని లోకంయొక్క మెప్పులుకాదు. లోకంమీద మమకారం ఎక్కువగాఉన్నంతకాలం నిజం నీకు అనుభవంలోనికిరాదు. ఆత్మ ఆడంబరంగాఉండదు అందుచేత నీవుకూడా ఆడంబరంలేకుండా ఉండు. నీమాటలో, చేతలో, వేషధారణలో, దైనందినజీవితంలో నీవ్యవహారంలో ఆడంబరంఉండకూడదు. లోపలఉన్న వస్తువుకు ఆడంబరంలేదు అందుచేత నీవుకూడా ఆడంబరంలేకుండా జీవిస్తే లోపలఉన్న వస్తువు నీకు నిజమైన నేనుగా వ్యక్తమవుతుంది, అదే నారాయణస్వరూపం.

కాటన్‌దొరకు మానవజాతిఅంటే ప్రేమ. పూర్వం ఉభయగోదావరి జిల్లాలలో కరువువచ్చినప్పుడు గోదావరికి ఆనకట్ట కట్టడంకోసం బ్రిటిష్‌వారు అడిగితే తానుకడతానని వచ్చాడు. ఆయన ఆనకట్టకట్టే సమయంలో ఖర్చుఎక్కువ అవుతోందిఅని ప్రభుత్వం తిట్టేది, ఆనకట్టవలన కాలవలు వస్తాయి, పడవలలో ప్రయాణాలుచేస్తారు మాకు పనిఉండదుఅని బండ్లుతోలుకొనేవారు తిట్టేవారు ఇవిఅన్నీ భరించి ఇంటికివస్తే ఇక్కడ పాముల బాధపడలేకపోతున్నాము ఈ గ్రామంలో ఎందుకు మనం పట్టణాలలో ఉండవచ్చుకదా అని భార్యతిట్టేదట. ఇన్ని అవమానాలు భరించి ఆయన ఆనకట్టకట్టారు. ఈమధ్య గోదావరి జిల్లాలలో కాటన్ విగ్రహాలు ఎక్కువగా పెడుతున్నారు ఏమిటిఅని నన్నుఅడిగారు. ఆయనఏదో మంచిపని చేసివెళ్ళిపోయాడు. ఇంత గౌరవంవస్తుందిఅని ఆయనఅనుకోలేదు. చేసిన మంచికి ఫలం విగ్రహాలరూపంలో ఆయనను స్మరించుకొంటున్నారు. ఇలా స్మరించుకొంటారని ఆయన ఆనకట్ట కట్టలేదు. ఆయనచేతిలోఉన్న పనిని శ్రద్ధగాచేసివెళ్ళిపోయాడు అనిచెప్పాను. మీచేతిలోఉన్న పనిని శ్రద్ధగాచేయండి. చేతిలోఉన్న పనిని వదిలేసి భవిష్యత్ గురించి ఊహించుకోవటం చెడ్డ, జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటంకూడా చెడ్డే. మీరు విజయం సాధించటానికి చేతిలోఉన్న పనిని శ్రద్ధగాచేయండి, ప్రేమగాచేయండి, నిష్కామంగాచేయండి. నిండుమనస్సుతో అంకితభావంతో చేయండి. అది కర్మయోగం. ఇలాచేయటంవలన మీరు కర్మయోగి అవుతారు, ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు, మీకు చిత్తశుద్ధి కలుగుతుంది, మోక్షద్వారం తెరువబడుతుంది.